మన కథ

— అల్లూరి శివ

ఆ విశాలమైన హాలులో వున్న మను షుల మనసుల్లాగే, ఎయిర్ కండిషనర్ కృత్రిమంగా చల్లటి గాలిని పంపిస్తూంది. వాళ్ళ హిపోక్రసీ లాగ, ఇండోర్ ప్లాంట్స్ ఆ రూమ్‌కి అందాన్ని ఆపాదిస్తున్నాయి.

'విస్వార్థ' గ్రూప్ ఆఫ్ కంపెనీస్ కాన్ఫరెన్స్ హాలు అది. ఆ గ్రూప్ చరిత్రలోనే చారిత్రాత్మకమైన మీటింగ్ జరగబోతోంది ఆ రోజు అక్కడ. అట్టడుగు స్థాయి ఉద్యోగి నుండి, ఛైర్మన్ వరకు అందరు అక్కడ కలుసుకోబోతున్నారు. అది ఆ మీటింగ్‌కు వున్న ప్రత్యేకత.

ఎజెండాలోని అంశాలను ఉత్సుకతతో చర్చించుకుంటున్న ఉద్యోగులందరు ఛైర్మన్ రావటంతో మౌనం వహించారు. యుద్ధభూమిలో వైరి పక్షాల సేనానులు తమ తమ వ్యూహాలను సమీక్షించుకుంటుండగా ఏర్పడిన నిశ్శబ్దంలాంటిది అక్కడ వ్యాపించింది.

ఛైర్మన్ రమేష్ మెహర్ ప్రాక్టికల్ మనిషి. అనవసర ప్రసంగాలకు పోకుండా మీటింగ్‌ని ప్రారంభిస్తూ "ఫ్రెండ్స్! ఈ రోజు మన 'గ్రూప్' చరిత్రలోనే చిరస్మరణీయమైంది. పది సంవత్సరాల క్రితం ఒక కంపెనీతో ప్రారంభమయిన 'మన సంస్థ ఈనాడు ఏడు కంపెనీలుగా విస్తరించిందంటే, కేవలం మేనేజ్‌మెంట్ కృషి, ప్లానింగ్‌ల వలన మాత్రమే కాదు, ఇందులో భాగస్వాములయిన మీ అందరి సహాయ సహకారాల వలన కూడానని సవినయంగా మనవి చేస్తున్నాను. నిజానికి మీ అందరి సమిష్టి కృషి వల్లనే ఈ సంస్థ ఇంతగా అభివృద్ధిచెందింది" అంటూ ఆగాడు.

ఉద్యోగులందరిలో అమితమైన సంచలనం. ఏదో ఊహిస్తున్నవారిలో అతడి ప్రసంగం కలకలాన్ని రేపింది. వాళ్ళ రియాక్షన్స్ గమనిస్తున్న రమేష్ మెహర్ సంతృప్తిచెందాడు. అత్యంత నాటకీయంగా సాగిన అతడి ఉపన్యాసం ఉద్యోగులలోని చాలా రూమర్స్‌కి సమాధి కడుతుందని తెలుసు. తర్వాత చెప్పబోయే విషయాలు వాళ్ళ మనసుల్లోని అసంతృప్తిని కూకటి వేళ్ళతో సహా పెకలించివేస్తుందని కూడా తెలుసు. తిరిగి కొనసాగించాడు.

"మీకు తెలుసు మన గ్రూపులో మరో లిమిటెడ్ కంపెనీ ప్రారంభించబడింది. ఈ శుభ సందర్భంలో మూల స్తంభాలయిన మీ అందరికీ కృతజ్ఞతలు తెలియచేసుకునే అవకాశం మాకు కలిగింది. ఈ కంపెనీ షేర్లను ప్రతి ఎంప్లాయికి, వెయ్యి చొప్పున ఇవ్వాలని నిర్ణయించాం. అంతేకాదు, అత్యంత ప్రతిభాపాటవాలను ప్రదర్శించిన ఉద్యోగికి, సంవత్స

రానికి ఒకరికి యాభై వేల రూపాయలను "ప్రోత్సాహక" బహుమతిగా ఇవ్వాలని మేనేజ్‌మెంట్ కమిటీ నిర్ణయించింది. అలా ఈ సంవత్సరం ఎంపికైన వ్యక్తి 'నిస్వార్థ ఎక్స్‌పోర్ట్స్' సేల్స్ మేనేజర్ 'మిస్టర్ రామస్వామి'. ఆయన వచ్చి చెక్ తీసుకోవాలని మనవి చేస్తున్నాను" అని ఆగి "మీ అందరి సహాయ సహకారాలను ఈ సంస్థ పురోభివృద్ధికి ఎల్లప్పుడూ ఆశిస్తున్నాను" అంటూ ముగించాడు.

అందరి హర్షధ్వానాల మధ్య రామస్వామి చెక్ అందుకున్నాడు. అతడి మొహం అమితమైన ఆనందంతో వెలిగిపోతోంది. బహుమతిని తనకు ఇచ్చినందుకు కృతజ్ఞతలు చెప్పాడు.

అప్పటి వరకు ఆ సంస్థ అంతర్గత వ్యవహారాల పట్ల, మేనేజ్‌మెంట్ మనీ మేకింగ్ పాలసీ పట్ల అసంతృప్తిగా వున్న ఉద్యోగులందరూ ఇప్పుడు సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ, తమకు రాబోయే లాభాలను బేరీజు వేసుకోసాగారు. ఆ గ్రూపు మిగతా కంపెనీల షేర్ వాల్యూ వందపైనే వుంది.

xxx

వారం రోజుల తరువాత,

రమేష్ మెహర్ ఇంట్లో డైనింగ్ టేబుల్ దగ్గర కుటుంబ సభ్యులందరూ వున్నారు.

రమేష్ మెహర్ చిన్న కొడుకు అడిగాడు "డాడీ!" ఆ రామస్వామి కంపెనీ సొమ్ము తింటున్నాడని తెలిసీ, మీరు అతడికి 'ఎంకరేజింగ్ ప్రైజ్' ఎందుకు ఇచ్చారో నాకు అర్థంకావటం లేదు". అతడు మొన్నమొన్ననే చదువు పూర్తిచేసుకుని వచ్చాడు. బిజినెస్ లావాదేవీలు, డిప్లొమాటిక్ వ్యవహారాలు ఇంకా పూర్తిగా అర్థం కావటంలేదు.

రమేష్ తింటున్నవాడల్లా ఒక్క క్షణం ఆగి, "తెలుసు! అతను తింటున్నాడని తెలుసు. ఇక్కడే చిన్న లాజిక్ వుంది. మన ప్రోడక్టు క్వాలిటీని సూపర్‌విజువలైజ్ చేసి, మన కంపెనీ ఫేమ్‌ని త్రీ-డి ఎఫెక్ట్‌లో చూపించి, కొనేవాడిని మెస్మరైజ్ చేసి మరే కంపెనీ అమ్మనంత ఎక్కువ రేటుకి అమ్ముతున్నాడు. దీనివలన మనకి, మిగతా కంపెనీల కంటె పదిహేను శాతం ఎక్కువ లాభాలొస్తున్నాయి. అందులో అతడు అయిదు శాతం తింటున్నాడు. తిననీ. మనకి రెట్టింపు తెస్తున్నాడు కదా. ఎదుటి వాడి అవసరాన్ని తీర్చి, తను సొమ్ము చేసుకోవటమే బిజినెస్. అదే అతడి స్థానంలో మరొకరిని నియమిస్తే, అతడిలా మన ప్రోడక్టుని మార్కెట్ చెయ్యలేకపోవచ్చు" అన్నాడు.

చారు వడ్డించుకుని, "అటువంటి వాడికి ప్రైజ్ ఇవ్వటం గురించి కదూ నువ్వంటున్నది. ఇక్కడ కూడా లాజిక్ వుంది. ఆ రామస్వామి తింటున్నాడని గ్రూప్‌లో అందరికీ తెలుసు. మనకి తెలుసునని అతడికీ తెలుసు. అతడిని మనం ఏమీ చెయ్యటంలేదని మిగతావాళ్ళలో అసంతృప్తి వుంది. అతడి మీద మనకి ఏ అనుమానం లేదని చెప్పాలంటే ఇదొక్కటే మార్గం. దాంతో అతడు మరింత కష్టపడతాడు. అతడి కష్టానికి యాభై వేలు పెద్ద మొత్తం కాదు. ఇది మిగతా ఎంప్లాయిస్‌కి ఉత్తేజాన్ని ఇస్తుంది. వచ్చే సంవత్సరం కోసం అందరూ ప్రయత్నిస్తారు. దానితో వాళ్ళ ఆలోచనా సరళి మారుతుంది. ఏ కంపెనీ అంతర్గత వ్యవహారాలైనా లీక్ అయ్యేది ఆ కంపెనీ ఉద్యోగుల వల్లనే. వాళ్ళ అసంతృప్తిని తొలగించటం కోసం, షేర్స్ ఇస్తానన్నది అందుకే. మన కంపెనీ షేర్ వాల్యూ నీకు తెలుసుగా" టూ డిప్లొమాటిక్‌గా నవ్వి "ఇక్కడ అందరూ లాభం పొందుతారు వాళ్ళ వాళ్ళ స్థాయిల్లో. మన రహస్యాలేవీ బయటకు రాకుండా వుండటం కోసం ఇటువంటివి తప్పవు" అన్నాడు. ఆ నవ్వులో అతడికి బిజినెస్ విశ్వరూపం సాక్షాత్కరించినట్లయ్యింది.

తొందరగా డబ్బు చేసుకుందామని చిన్న మొత్తాలతో షేర్లను కొనుక్కునే చిన్న ఇన్వెస్టర్స్, ఆ కంపెనీల తాలూకు ఇటువంటి వ్యవహారాల గురించి తెలియక అమాయకంగా మోసగించబడుతున్నారు. అదే ఈ కథకు ముక్తాయింపు.

●

నాట్యాభ్యాసంలో కలిగే మెడ నొప్పులకు



కంప్యూటర్ స్క్రీన్ వలన కలిగే నొప్పులకు

మెట్లు ఎక్కడం వలన కలిగే నొప్పులకు

మహా స్ట్రాంగ్

పెయిన్ బామ్

ఈ కాలం నొప్పులకు ఈ కాలం బామ్

క్రొత్త మహా స్ట్రాంగ్ పెయిన్ బామ్ కలిగియున్నది నిజమైన శక్తిని. ఇందులోని శక్తివంతమైన మూల పదార్థములు, నేరుగా నొప్పియున్న చోటుకు చొచ్చుకుని పోయి, విపరీతమైన బాధల నుండి విముక్తి కలిగిస్తాయి. తృటిలో మీ మోముపై చిరునవ్వును తెప్పిస్తుంది.

O & M 3911 TG

క్రొత్త మహా స్ట్రాంగ్ పెయిన్ బామ్, మహా బాధల నివారిణి. అమృతాంజన్ లిమిటెడ్